సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



నేటి నుంచి రథసప్తమి ఉత్సవాలు

ఆగిరపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి రథసప్తమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8లో



అంబేడ్కర్ విగ్రహాలు హర్షణీయం

తెలుగు రాష్ట్రాల్లో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఐడియా అధ్యక్షుడు రాజసుందర్‌బాబు అన్నారు. 8లో



పారిజాతగిరిలో కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం చొల్లంగి అమావాస్య కావడంతో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎన్నికలపై అవగాహన తప్పనిసరి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సార్వత్రిక ఎన్నికలను పూర్తి అవగాహనతో పకడ్బందీగా పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికలు, రీ సర్వే, స్వమిత్వ, గృహనిర్మాణాల రిజిస్ట్రేషన్, వైద్యారోగ్యశాఖ తదితర అంశాలపై సమీక్షించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు బాధ్యతాయుతంగా పనులు నిర్వహించాలన్నారు. రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పనులు వేగిరపర్చాలన్నారు. ఎన్నికలకు సంబంధించి కచ్చితంగా స్వీప్ యాక్టివిటీ నిర్వహించాలన్నారు. యువ ఓటర్లను గుర్తించి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలు రూట్ మ్యాప్‌ను, సంబంధిత బీఎల్ఓల వివరాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలరు. వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఆర్డీఓలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ల నిర్మాణం వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మల్టీపర్పస్ గోడౌన్లను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి అమలు కమిటీ సభ్యులతో గోడౌన్ల నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లాలో 22 గోడౌన్ల నిర్మాణాలకు ఇప్పటివరకు అజ్జమూరు, మల్లవరం, ఆచంట, పోడూరు, చినమల్లం, మోగల్లు, పెనుమంచిలి, పండితవల్లూరులో నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి పలు దశల్లో ఉన్నాయన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కేసీహెచ్ అప్పారావు, డీసీసీబీ ఏజీఎం నరసింహరావు, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఆకివీడు జట్టు విజయకేతనం

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు శుక్రవారం విశాఖ రైల్వే స్టేడియంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు నాలుగు దశల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్‌లో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మహిళల జట్టు విజయం సాధించింది.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు శుక్రవారం 632 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలోని 7 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరిగాయని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు. ఈనెల 11 నుంచి ఒకేషనల్ విద్యార్థులకు రెండో విడత, జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు

చకచకా పనులు

- జిల్లాలో 25 రహదారి పనులకు రూ.84 కోట్ల మంజూరు
- వచ్చే నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు
- సుమారు 230 కిలోమీటర్ల మేర నిర్మాణం



వీరవాసరం–పెనుమంట్ర రహదారిలో పాలమూరు వద్ద సిమెంట్ రోడ్డు పనులు

భీమవరం: జిల్లాలో రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాణ్యతా లోపంతో చేపట్టిన పలు రోడ్లు భారీవర్షాలకు దెబ్బతినడంతో అధ్వానంగా మారగా వాటి పునరుద్ధరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లాలో 6 రాష్ట్ర రహదారులు, 19 జిల్లా ప్రధాన, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.84 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సుమారు 230 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ పనులు చేపట్టింది. 41.5 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులకు రూ.22.30 కోట్లు, 19 ప్రధాన జిల్లా, గ్రామీణ రోడ్లకు రూ.62.14 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖ రోడ్ల నిర్మాణానికి టెండర్లను పూర్తిచేసి కాంట్రాక్టర్లు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంది. ఏకకాలంలో పలుచోట్ల రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్రధాన జిల్లా, గ్రామీణ రహదారులు

రహదారి	కిలోమీటర్లు	నిధులు (రూ.కోట్లలో)
కుమ్మరపాలెం–అబ్బిరాజుపాలెం	13.0	3.90
లంకలకోడేరు–కొప్పర్రు	5.6	3.00
కవిటం బ్రిడ్జి–గుమ్ములూరు	7.4	3.00
పేరుపాలెం–మొగల్తూరు	13.7	2.50
లంకలకోడేరు–కొప్పర్రు	11.8	2.70
నరసాపురం–కరింశెట్టిపాలెం	13.0	3.00
పంజావేమవరం–లంకలకోడేరు	4.8	2.50
వీరవాసరం–మత్స్యపురి రోడ్డు	7.0	6.00
భీమవరం–ఎల్‌వీఎన్‌పురం	5.8	3.00
చినమిల్లిపాడు–మాలవానితిప్ప	2.0	2.50
విజయవాడ–విశాఖ రోడ్డు	15.0	6.90
కాగుపాడు–జట్లపాలెం	34.0	5.00
మంచిలి–మోగల్లు	9.2	2.50
అత్తిలి–ఐరగవరం	8.0	1.50
యర్రాయిచెరువు–పి.వేమవరం	8.3	3.00
కొల్లేరు–భీమవరం	10.0	2.80
చిరుకూరు–గణపవరం	5.5	3.00
గొల్లలకోడేరు–నవుడూరు	6.0	2.50
వల్లూరు–వీరేశ్వరపురం	7.8	2.84

వచ్చే నెలాఖరుకు పూర్తి



జిల్లాలోని వివిధ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆరు స్టేట్ హైవే రహదారుల్లో సుమారు 41.5 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.22.30 కోట్లు మంజూరయ్యాయి. అలాగే 19 మేజర్ డిస్ట్రిక్ట్, గ్రామీణ రహదారుల్లో దాదాపు 190 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి సుమారు 62.14 కోట్లు మంజూరు కాగా మార్చి నెలాఖరుకు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నాం.

– ఎస్.లోకేశ్వరరావు, ఈఈ ఆర్అండ్‌బీ, భీమవరం

రాష్ట్ర రహదారుల మార్గంలో..

రహదారి	కిలోమీటర్లు	నిధులు రూ.కోట్లలో
భీమవరం–దొంగపిండి	11	7.00
వీరవాసరం–పెనుమంట్ర	6.5	3.00
కానూరు–లంకలకోడేరు	6.3	2.50
కలవపూడి–గణపవరం	7.2	4.60
సిద్ధాంతం–జుత్తిగ	7.2	2.20
భీమవరం–పిప్పర	3.0	3.00



పంజావేమవరం–రాయకుదురు మార్గంలో బీటీ రోడ్డు పనులు

నులి పురుగులతో అనారోగ్యం



విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: కడుపులో నులి పురుగులు పెరిగితే పిల్లలు అనారోగ్యానికి గురవుతారని, అపరిశుభ్రమైన చేతుల ద్వారా ఆహారం తీసుకోవడం వల్ల ఎక్కువ నష్టం కలుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని పీఎస్ఎం గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆమె ఆల్బెండజోల్ మాత్రలను వేసి అనంతరం మాట్లాడారు. జిల్లాలో అంగన్‌వాడీ పిల్లలు 51,649 మంది, 1 నుంచి 10వ తరగతి వరకు 2,35,711 మంది, ఇంటర్ నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం వరకు 38,025 మంది విద్యార్థులకు ఈనెల 16 వరకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ద్వారా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, డీఈఓ ఆర్.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తహసీల్దార్ ఎల్.శివకుమార్, హెచ్ఎం జె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసకారి



పెనుగొండలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టడంలో, మోసం చేయడంలో దిట్ట అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. శుక్రవారం పెనుగొండలో మసీదు వద్ద సీసీ రోడ్డు, ముస్లిం కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. చంద్రబాబు ఇప్పటివరకు బీజేపీని తిట్టి ఇప్పుడు వారి పొత్తు కోసం వెంపర్లాడుతున్నారని, గతంలో ప్రధాని మోదీని దారుణంగా విమర్శించారన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా వెళితే సింగిల్ డిజిట్ వచ్చే అవకాశాలు లేకపోవడంతో పొత్తుల కోసం తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్‌తో అంటకాగి ఇప్పుడు జనసేన, బీజేపీతో పొత్తులు కావాలంటూ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ఉంటే జన్మభూమి కమిటీల పేరుతో దోచేయడానికి ఉండదన్న ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను రద్దుచేయడానికి పన్నాగం పన్నుతున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ రద్దయితే అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మవద్దని, సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ముస్లింలకు సరైన ప్రాతినిధ్యం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందున్నారు. వారికి డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులు కేటాయించి అండగా నిలిచారన్నారు. భవిష్యత్‌లో మరింత సంక్షేమాన్ని అందిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు షేక్ రిజ్వానా, ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడు నాగూరు మీరా, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెలగల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఉండి నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఉండి నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక వసతులపై పూర్తి స్థాయిలో నివేదికలు అందించాలన్నారు. 80 ఏళ్లు దాటిన, దీర్ఘకాలిక వ్యాధితో మంచంపై ఉన్న ఓటర్లు ఇంటి దగ్గర నుండే ఓటు వేసుకునే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి ఆ అవకాశం కల్పించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామ, వార్డులపై దృష్టి పెట్టాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

అమ్మ దీవెన.. మహా నివేదన

ముగిసిన మావుళ్లమ్మ ఉత్సవాలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 60వ వార్షిక మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారికి మహా నివేదన నిర్వహించారు. ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా నివేదనను సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భారీ అఖండ అన్నసమారాధన ప్రారంభమైంది. నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, దేవస్థానం సంయుక్తంగా జనవరి 13న ప్రారంభమైన ఉత్సవాలు 26 రోజుల పాటు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రసాదంగా సమర్పించిన 36 కేజీల లడ్డూను పట్టణానికి చెందిన నందమూరు ఆంజనేయులు రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం సభ్యులు కొప్పుల సత్తిబాబు, రామాయణం గోవిందరావు, రామాయణం సత్యనారాయణ, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

90 వేల మందికి అన్నప్రసాదం

భీమవరంతోపాటు జిల్లా నలుమూలల నుంచి సుమారు 90 వేల మంది భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నసమారాధన కొనసాగింది. గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జిల్లా ఎస్పీ అజిత వెజెండ్ల ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ భీమారావు, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి మహానివేదన సమర్పిస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్





ప్రత్యేక అలంకరణలో మావుళ్లమ్మవారు, అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

సంక్షేమ శకం

నవరత్నాలతో కుటుంబానికి జవసత్వాలు



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు నా కుటుంబానికి జవసత్వాలనిచ్చింది. నాకు చేనేత కార్మిక పింఛన్ రూ. 3 వేలు మంజూరు చేశారు. చేనేత వస్త్రాలు ఆదరణ కోల్పోయిన వేళ ఈ సాయం చాలా మేలు చేసింది. నా భార్య డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉండడం వల్ల ఆసరా రుణమాఫీతో రూ.45 వేలు అప్పు తీరింది. 45 ఏళ్లు నిండడంతో చేయూత రూ.18,000 వచ్చింది. మా మనవళ్లకు అమ్మ ఒడి వస్తుంది. మాలాంటి పేద కుటుంబాలకు జగనన్నే అండా దండా.

– కూసం సత్యనారాయణ, చేనేత కార్మికుడు, చెక్కపల్లి, మూసునూరు



జగన్ బాబు వచ్చాక అన్నీ వచ్చాయ్



నా భర్త చనిపోవడంతో దివ్యాంగుడైన కుమారుడితో కలిసి ఉంటున్నాను. ముఖ్యమంత్రిగా జగన్‌బాబు వచ్చాక నా కుటుంబంలో నాకు చేయూత డబ్బులు రూ.18,750 నాలుగు సంవత్సరాలుగా వస్తున్నాయి. నాకు కుటుంబ పోషణకు వితంతు పెన్షన్ రూ. 3 వేలు ఇస్తున్నారు. నా కుమారుడు దివ్యాంగుడు కావడంతో వికలాంగుల పింఛన్ రూ. 3 వేలు ఇస్తున్నారు. ప్రతి నెలా ఇంటి దగ్గరకు రేషన్ బియ్యం ఇవ్వటం, పింఛన్ సొమ్ము ఇవ్వడంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఎప్పుడూ జగన్ బాబే ఉండాలి.

– పొట్నూరి కనకదుర్గ, లక్ష్మివారపుపేట, ఏలూరు

ముఖ్యమంత్రిగా మళ్లీ జగనే రావాలి



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక ఆయన పెట్టిన పథకాలు మా కుటుంబాన్ని ఆదుకుంటున్నాయి. నాకు కాపునేస్తం పథకంలో రూ. 15 వేలు ఇస్తున్నారు. నాకు కాళ్ళు, చేతులు అనారోగ్యంతో వంకర్లు పోయాయి. నాకు వికలాంగుల పింఛన్ కింద ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తున్నారు. నా భర్తకు వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేలు ఇస్తున్నారు. ముఖ్యంగా వలంటీర్లు ప్రతి నెలా ఒకటినే ఇంటికి వచ్చి మరీ పింఛన్‌ను అందిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ కారణంగా అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొందుతున్నాం. ప్రతి నెలా ఇంటి వద్దే రేషన్ బియ్యం ఇవ్వడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాం. పేదలను పెద్ద మనస్సుతో ఆదుకుంటున్న జగన్ బాబు మళ్లీ సీఎంగా రావాలని కోరుకుంటున్నాం.

– గోపిశెట్టి లక్ష్మి, 41వ డివిజన్, ఏలూరు

క్లుప్తంగా

ప్రతి అడుగూ విజయానికి మెట్టు కావాలి



ఏపీ నిట్‌లో మాట్లాడుతున్న గౌహతి ఐఐటీ ఆచార్యులు రవీంద్రనాథ్

తాడేపల్లిగూడెం: విద్యార్థి వేసే ప్రతి అడుగూ విజయానికి మెట్టు కావాలని గౌహతి ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ అడ్డా రవీంద్రనాథ్ అన్నారు. ఏపీ నిట్‌లో కాంప్రహెన్సీ ఓవర్ వ్యూ ఆఫ్ యాక్టివ్ పవర్ డికాప్లింగ్ విత్ అప్లికేషన్ స్విచ్డ్ బూస్ట్ ఇన్వెర్టర్ అనే అంశంపై శుక్రవారం మాట్లాడారు. కొత్త సాంకేతికలపై పట్టు సాధిస్తేనే ఆధునిక పోటీ ప్రపంచంలో నిలబడతారన్నారు. ఇన్వెర్టర్ నుంచి వచ్చే విద్యుత్ నాణ్యతను పెంచుకునేందుకు సమకూర్చుకోవాల్సిన పరికరాలపై అవగాహన కల్పించారు. కెపాసిటర్ ఇండక్టర్ పరికరాల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఎలక్ట్రికల్ రంగంలో నూతన ఆవిష్కరణల అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్, ఆచార్యులు పి.శంకర్, ఫణికృష్ణ, వి.సందీప్, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

మండవల్లి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండవల్లి మండలంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే లోకుమూడి గ్రామానికి చెందిన ధోనిపాటి అబ్రహం (26) కాకతీయనగర్‌లో ఉన్న కమిలి శివప్రసాద్ ఆరు ఎకరాల (లీజు) రొయ్యల చెరువు మీద నెల జీతానికి పని చేస్తున్నాడు. అయితే ఇటీవల కాలంలో అప్పులు చేసి పలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం చెరువు గట్టు మీద ఉన్న షెడ్డులో దూలానికి ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన యజమాని శివప్రసాద్ అబ్రహం తల్లి సుందరమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొవ్వాడ పుంతకు చెందిన ఉదూరి నాగమల్లేశ్వరి కుమార్తె (20) భీమవరంలోని అడ్డవంతెన వద్ద మూర్తి రాజు కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి నాగమల్లేశ్వరి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద కుమార్తె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది.

పవన్‌కల్యాణ్ మాట వింటే నష్టపోతారు



మాధవరం గ్రామంలో మహిళతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పవన్ కల్యాణ్ మాట విని తెలుగుదేశానికి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు అమలుకాక నష్టపోతారని ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. 'ఆశీర్వదించండి, అభివృద్ధి కొనసాగించేందుకు సహకరించండి' అనే నినాదంతో చేపట్టిన సకల జన సమ్మేళన యాత్ర మండలంలోని మాధవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ యాత్రలో మంత్రి కొట్టు సత్యనారాయణ కాలి నడకన ముందుకు సాగుతూ ప్రతి ఇంటి వద్ద ఆగి జనంతో మమేకమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. కాపు ప్రాబల్యం అధికంగా ఉండే మాధవరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సినీ వ్యామోహంలో పవన్ కల్యాణ్ మాట విని జనసేనలో తిరిగే కాపు యువతకు తల్లిదండ్రులు సరైన మార్గం చూపించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మేలు జరిగితేనే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎంపీటీసీ సభ్యులు మార్లపూడి సుబ్బారావు, వీరమళ్ళ వెంకన్న, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, పరిమి తులసి దాసు, వెలిశెట్టి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటు హర్షణీయం



రాజసుందర్‌బాబును సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆలిండియా దళిత ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఐడియా) అధ్యక్షుడు గొళ్ళమూడి రాజ సుందర్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు అంబేద్కర్‌ను ప్రపంచ విమోచకుడిగా ప్రకటించి జై భీమ్ పలికారని ఇది భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సభకు అధ్యక్షత వహించిన గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి, సహాయ కార్యదర్శి మొహమ్మద్ జుల్ఫీకర్ అలీలు వివరించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఐడియా అధ్యక్షుడు రాజ సుందర్ బాబుని ఘనంగా సత్కరించారు.

26న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

కాళ్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభ ఈ నెల 26న ఏలూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిలకపల్లి కట్లయ్య తెలిపారు. మండలంలోని పెద అమిరం గ్రామంలో రజకుల చెరువు వద్ద రజకుల ఫెడరేషన్ డైరెక్టర్ గోగురాజుతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రజకులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదుకోవాలని ఆయన కోరారు. ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు వరకు ఉండే గ్రామాలు, మండలాలు, పట్టణాల నుండి పెద్ద సంఖ్యలో రజకులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భీమవరంలో ఏడవ వార్డులో రజకుల విశ్రాంతిభవనానికి 20 లక్షలు స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కేటాయించారని ఈ సందర్భంగా ఆయనకు కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు కృతజ్ఞతలు తెలిపారు. పెనుగుర్తి చిన్నపన్న, యండమూరి ప్రసాదు, యండమూరి సింహాద్రి పాల్గొన్నారు.

నేటి నుంచి శోభనాచలుని రథసప్తమి ఉత్సవాలు



వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి

ఆగిరిపల్లి: మండలంలోని ఆగిరపల్లిలో ఉన్న శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం నుంచి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మాఘమాస కల్యాణ మహోత్సవ తిరునాళ్లకు జిల్లా వారే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. శనివారం సాయంత్రం స్వామి వారిని చంద్ర ప్రభ వాహనంపై ఊరేగింపుగా కల్యాణ మండపంలో తీసుకువచ్చి పెళ్లి కుమారుడిగా అలంకరించి రాత్రి 9 గంటలకు నిత్య కల్యాణాన్ని వేద పండితులు జరిపిస్తారు. ఇలా పది రోజుల్లో పాటు గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఈ నెల 17న ఉదయం 8 గంటలకు గ్రామంలోని నాలుగు మండపాల చుట్టూ గోవింద నామస్మరణ మధ్య అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. 18, 19 తేదీల్లో నిత్య కల్యాణం, 20న యోగాంజనేయ స్వామి వారికి పంచామృత స్నపన, రజత ఉయ్యాల ఉత్సవం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు నూజివీడు ఎమ్మెల్యే ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్వామి కల్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతి

భీమడోలు: ఓ వ్యక్తి కాలుజారి గోదావరి కాలువలో మునిగి మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం భీమడోలులో చోటు చేసుకుంది. భీమడోలు శివారు సాధుగారి దిబ్బ ప్రాంతానికి చెందిన దినసరి కూలీ పల్నాటి శ్రీను(50) మద్యం మత్తులో స్నానం చేసేందుకు లింగంపాడు వంతెన వద్ద గోదావరి కాలువలో దిగాడు. అయితే ప్రమాదవశాత్తూ కాలు జారీ నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో రెస్క్యూ టీము హుటాహుటిన గోదావరి కాల్వ వద్దకు వచ్చి శ్రీను కోసం గాలింపు చర్యలు చేపట్టింది. సుమారు గంట సేపు గాలించి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ మృతదేహాన్ని పరిశీలించి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. అయితే గత కొన్నేళ్లుగా భార్య భర్తకు దూరంగా కువైట్‌లో ఉంటోంది.

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామయ్యహాలు ప్రాంతంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం వేకువజామున (గురువారం రాత్రి) సుమారు 3 గంటల సమయంలో రామయ్యహాలుకు చెందిన అంగర వెంకట నారాయణ, నాగశైలజ కుమార్తె శృతి (12) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆ బాలిక పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. ఈ మేరకు బాలిక తల్లి శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు తెలిపారు.

ముగిసిన గిరిజన క్రీడోత్సవాలు



బుట్టాయగూడెంలో బహుమతులను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో హోరాహోరీగా జరిగిన గిరిజన క్రీడోత్సవాలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. అలాగే క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం రాత్రి స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరు సునీల్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి తదితరుల చేతుల మీదుగా కబడ్డీ, వాలీబాల్, విలువిద్య క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. నగదుతోపాటు మెమెంటో, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

తణుకు: మండలంలోని దువ్వ గ్రామానికి చెందిన వివాహిత గురువారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త చేసిన అప్పులు తీర్చాలని ఇరుగు పొరుగు ఒత్తిడి చేస్తుండడంతో మనస్తాపం చెందిన గ్రామానికి చెందిన నీలం విజయదుర్గ (28) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన విజయదుర్గకు దువ్వ గ్రామానికి చెందిన రాజేష్‌కు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు కాగా రాజేష్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ అప్పులు చేశాడు. దీంతో బాకీలు తీర్చాలని పలువురు ఒత్తిడి చేస్తున్నారు. అయితే గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన మహిళ ఇద్దరిని వెంటేసుకుని తనకు ఇవ్వాల్సిన రూ. 50 వేలు ఇవ్వాలని అడిగింది. దీంతో మనస్తాపం చెందిన విజయదుర్గ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి శ్రీరాములు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాసవీ ఇంజినీరింగ్ కళాశాలకు ఐదు పరిశోధన కేంద్రాలు



మంజూరు పత్రాలు అందజేస్తున్న జేఎన్‌టీయూ కాకినాడ వీసీ ప్రసాదరాజు

తాడేపల్లిగూడెం: మండలంలోని పెదతాడేపల్లిలో ఉన్న వాసవీ ఇంజినీరింగ్ కళాశాలకు ఐదు పరిశోధనా కేంద్రాలను జేఎన్‌టీయు కాకినాడ మంజూరుచేసినట్టు పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. దీంతో ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ , కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాలతో పాటు ఇంగ్లిషు పీహెచ్‌డీ ప్రవేశాలకు అవకాశం కలుగుతుందన్నారు. పరిశోధనల కోసం ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ దాని కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఈ మేరకు కాకినాడలో పరిశోధనా కేంద్రాల మంజూరు పత్రాలను జేఎస్‌టీయూ వీసీ జీవిఆర్ ప్రసాదరాజు చేతుల మీదుగా అందుకున్నారు. పాలకవర్గ బాధ్యులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, డీన్స్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎం కొట్టును సత్కరించిన ఆర్యవైశ్యులు



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్యులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన శ్రీవాసవి ఆలయంలో నూతనంగా నెలకొల్పిన 27 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు హాజరు కావాలని ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొల్లేపర శ్రీరామచంద్రమూర్తి, సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, కోశాధికారి భోగవల్లి రమేష్, ఉపాధ్యక్షుడు చలంచర్ల సుబ్రహ్మణ్యం, చలంచర్ల గిరి, పులవర్తి రాంపండు, ఏకాంబరేశ్వరరావు, బద్రి, గుప్త, నాగేశ్వరరావులు ఉన్నారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత అని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 33, 34, 35 వార్డుల్లో జరుగుతున్న ఆరోగ్య, కీటకజనిత వ్యాధులపై శుక్రవారం హెల్త్ సిబ్బందికి అవగాహన ర్యాలీలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ప్రజలకు ముందుస్తు కీటక నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అపరిశుభ్ర వాతావరణం నమోదు చేయాలన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు విశేష కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు జ్యోతి, చినపాప, రాజేశ్వరి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పట్ల హర్షం



చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివంగత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం తెలుగు ప్రజలకే గర్వకారణమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు హర్షం ప్రకటించారు. పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంతో పాటు ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేసిన మహా మేధావి పీవీ అని కొనియాడారు. సకల భాషా కోవిదునిగా, గొప్ప రచయిత అయిన పీవీకి భారతరత్న పురస్కారం ప్రకటించడం సముచిత నిర్ణయమని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు ప్రకటించారు.

ఘనంగా బేసిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఎంఈవో టీవీ రామకృష్ణ

పెంటపాడు: ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హెచ్ఎం ఎన్. రాజేష్ ఆధ్వర్యంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి దేశానికి ఒక ఆయుధంలా తయారు కావాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పేరెంట్స్‌కమిటీ అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక, రైతు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ సమావేశం కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలతో సమ్మె సన్నాహక సమావేశం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కార్మిక, రైతు సంఘాల సంయుక్త కార్యాచరణ వేదిక పిలుపు మేరకు సార్వత్రిక సమ్మె జరుగుతుందని తెలిపారు. అనుబంధ కార్మిక సంఘాలను సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, కనక మహాలక్ష్మి, మేళం నాగరాజు పాల్గొన్నారు.

పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధం

- నూరు శాతం ఉత్తీర్ణత కోసం శ్రమిస్తున్న విద్యార్థులు
- ఉపాధ్యాయుల అత్యుత్తమ బోధన
- నియోజకవర్గంలో 4,086 మంది పదో తరగతి విద్యార్థులు
- వచ్చే నెల 18 నుంచి పది పరీక్షలు మొదలు



తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు



తణుకులో ప్రభుత్వం పంపిణీ చేసిన విజయకేతనం బుక్స్ చూపిస్తున్న పదో తరగతి విద్యార్థులు

తణుకు అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ప్రతి పాఠశాలల్లోను విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు తుది దశకు చేరింది. వచ్చే నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ముందుగానే ప్రకటించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. మెరిట్ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా వెనుకబడిన విద్యార్థులు పాస్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కసరత్తులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఉదయం, సాయంత్రం అదనపు సమయాలు కేటాయించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు 58 పాఠశాలలకు సంబంధించి 4,086 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.

తణుకు నియోజకవర్గంలో పది విద్యార్థుల వివరాలిలా...

	తణుకు	ఇరగవరం	అత్తిలి
ప్రభుత్వ పాఠశాలలు	11	7	10
ప్రైవేటు పాఠశాలలు	25	1	4
ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య	1242	506	495
ప్రైవేటు విద్యార్థుల సంఖ్య	1729	45	69

విధిగా మోడల్ టెస్టులు..

ప్రభుత్వం అందజేసిన మోడల్ టెస్టుల ప్రకారం ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేస్తూ పరీక్షలు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్ట్‌లోని పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని పాఠ్యంశంలోని ప్రశ్నలకు జవాబులను రూపొందించేలా యాక్షన్ ప్లాన్‌తో విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఉదయం గంట, సాయంత్రం గంటన్నర అదనపు తరగతులు నిర్వహిస్తూ వారికి పోషకాహారం అందచేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం కొన్ని పాఠశాలల్లో వారానికో పరీక్ష నిర్వహిస్తుండగా మరికొన్ని పాఠశాలల్లో మాత్రం బాగా మెరిట్ విద్యార్థులను గుర్తించి వారికి ప్రతిరోజూ పరీక్ష నిర్వహిస్తున్నారు.

విజయకేతనం బుక్స్...

విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ ఏడాది జిల్లా పరిషత్ నిధులతో ప్రత్యేకంగా విజయకేతనం అనే బుక్స్ తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో ముద్రింపజేసి పదో తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా అందజేసింది. అన్ని సబ్జెక్టుల్లోను నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందింపబడిన ఈ విజయకేతనం పుస్తకాలు విద్యార్థులకు చాలా బాగా ఉపయోగపడుతున్నాయని పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..



పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరినీ అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయుడు పర్యవేక్షణ పూర్తిస్థాయిలో ఉంటుంది. ప్రతి విద్యార్థి పాస్ అవ్వాలనే ఉద్దేశ్యంతో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం అందించిన మోడల్ టెస్టులు కూడా విద్యార్థులకు సద్వినియోగపడుతున్నాయి.

– ఎస్.శ్రీనివాసరావు, ఇరగవరం మండల విద్యాశాఖాధికారి

విజయకేతనం పుస్తకాలు సద్వినియోగపడుతున్నాయి



విద్యాశాఖ అధికారుల ఆదేశానుసారం ఉపాధ్యాయులంతా ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి ఏర్పాటుచేశారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందచేసిన విజయకేతనం పుస్తకం చాలా బావుంది. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులు కనీసం పాస్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివిస్తున్నారు.

– నారగాని రమేష్, ఎంఈవో, అత్తిలి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులపై పూర్తి పర్యవేక్షణ చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. విద్యాబోధనలో తల్లితండ్రులు, పేరెంట్స్ కమిటీని కూడా భాగస్వామ్యం చేస్తూ విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులంతా కృషిచేస్తున్నాం.

– డి.మురళి సత్యనారాయణ, ఎంఈవో 1, తణుకు

మంచి మార్కులు సాధిస్తాను



పదో తరగతి పరీక్షలకు పూర్తిగా సన్నద్ధం అయ్యాను. ప్రభుత్వం అందించిన విజయకేతనం పుస్తకం చాలా బావుంది. ఈ పుస్తకం ద్వారా 70 శాతం మార్కులు సాధించే అవకాశం ఉంది. మా ఉపాధ్యాయులు మమ్మల్ని చాలా బాగా తీర్చిదిద్దుతున్నారు. మా ఉపాధ్యాయులంతా మాపై ఎంతో నమ్మకం పెట్టుకుని విద్యాబోధన చేస్తున్నారు. వారి నమ్మకాన్ని వృధా చేయం.

– నౌడు శ్రీలిఖిత, 10వ తరగతి విద్యార్థిని, తణుకు

యాక్షన్ ప్లాన్ ద్వారా విద్యాబోధన



తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో చదువుతున్న నాకు మా ఉపాధ్యాయులు చక్కటి సహకారాన్ని అందిస్తున్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలో మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యార్థులు స్వేచ్ఛగా విద్యనభ్యసించేలా పరిస్థితులు ఉన్నాయి. ఒక యాక్షన్ ప్లాన్ అనుసరిస్తూ మాకు విద్యాబోధన చేస్తున్నారు. పరీక్షలు బాగా రాసేందుకు అత్యుత్తమ బోధన అందింది.

– జి.పవన్‌కిషోర్, 10వ తరగతి విద్యార్థి, తణుకు

సురక్షతో పేదలకు ఆరోగ్య భరోసా



ఇరగవరం: కె కుముదవల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



అత్తిలి: ఆరవల్లిలో జగనన్న ఆరోగ్యసురక్షలో మందులను అందజేస్తున్న ఉపసర్పంచ్, తదితరులు

ఇరగవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని కె కుముదవల్లి సర్పంచ్ రామాయణం జగదీష్ అన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిండి గోవింద రాజు, ఎంపీడీవో కె పద్మజ్యోతి, ఈవోపీఆర్డీ నరసింహమూర్తి, వైద్యులు నిమ్మల సత్యనారాయణ మౌనికా, దుర్గా భవాని, పంచాయతీ కార్యదర్శి కె వెంకటలక్ష్మీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరవల్లిలో జగనన్న ఆరోగ్యసురక్ష

అత్తిలి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 2వ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం ఆరవల్లి సచివాలయం వద్ద 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు యశోద పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరికి సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని కుంచనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ రైల్వే ఫీడర్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. జూబ్లీరోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, వెంకటరత్నం ఆస్పత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బంది లేకుండా చూడాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం వీరంపాలెం గ్రామంలో చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా మందులు, మైక్రో న్యూట్రియంట్లు కూడా సప్‌లై చేయాలన్నారు. ఈ క్రాపులో ఏ విధమైన పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌ప్రసాద్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



అత్తిలి: ఎర్రనీలిగుంట పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



పెంటపాడులో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. అత్తిలి మండలం తిరుపతిపురం సెక్టార్ పరిధిలో ఎర్రనీలిగుంట ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వరాదని, శరీరం ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. మనం తినే ఆహారంలో ఆకు కూరలు ఉండేలా చూడాలన్నారు. ఆడపిల్లను రక్షిద్దాం-ఆడపిల్లలను ఎదగనిద్దాం-ఆడపిల్లలను చదవనిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సత్రాజు, అంగన్‌వాడీ కార్యకర్త జి లక్ష్మీకుమారి, బాలబాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెంటపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పెంటపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని ,సుజాత, బీజీబీ విజయలక్ష్మిలు పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండంలో పలు గ్రామాల్లో జరిగిన సెక్టార్ సమావేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగంలో మహిళలు ఎంతో గానో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెంటపాడు, ముదునూరు ప్రాథమిక వైద్యాధికారులతో పాటు, ఆయా గ్రామాల ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ఆడుదాం ఆంధ్రా ఖోఖో జట్టుకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ



ఖోఖో కెప్టెన్ బోణం యశస్విని

తాడేపల్లిగూడెం రూరల్: ఆడుదాం ఆంధ్రాలో సత్తాచాటిన రూరల్ మండలం రామన్నగూడెం జట్టు భీమవరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మహిళల ఖోఖో విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అభినందనలు చెప్పారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించండంతో జిల్లాస్థాయికి వెళ్లారు. జిల్లా స్థాయిలో ద్వితీయ, నియోజకవర్గ స్థాయిలో ప్రథమస్థానంలో నిలవడంతో రూ.65 వేలు విలువైన నగదు బహుమతులు సాధించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ చింతా వెంకట్రావు, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనకు సహకరించండి

అత్తిలి: పంటచేలల్లో గుర్తించిన ఎలుక బొరియల్లో రైతులు సామూహికంగా విషపు ఎర పొట్లాలను ఉంచడం ద్వారా ఎలుకలను నిర్మూలించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు ఉచితంగా ఎలుకల మందును అందజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టాలి

తణుకు టౌన్: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారానే పంట నష్టాన్ని తగ్గించవచ్చని మండల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ రమేష్ చెప్పారు. శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులంతా ఒకేసారి మందును పెట్టడం ద్వారా ఎలుకలను చాలావరకూ నిర్మూలించవచ్చన్నారు. ఏవో సీహెచ్ శ్రీనివాసరావు, టెక్నికల్ ఏవో బీ రాధిక ప్రియదర్శిని, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని అన్నిగ్రామాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ఎఈవో, వీఏఎలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో పిల్లలకు మేలు



తణుకు టౌన్: మండపాకలోని పాఠశాల విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది



తాడేపల్లిగూడెం రూరల్: నులి పురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ పీఎంకే జ్యోతి



తాడేపల్లిగూడెం (టీఓసీ): నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న దృశ్యం



అత్తిలి: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం



ఇరగవరం: రేలంగి జెడ్పీ హైస్కూల్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులు ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు చెప్పారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో డి వార్మింగ్ మాత్రలు మింగించారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకలోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపునొప్పి, బరువు తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కొంటారని తెలిపారు. డాక్టర్ కిరణ్మయి, సీహెచ్ఓ పి మురళి, హెచ్‌వీ పి అమ్మాజీ, ఎంపీహెచ్ఎస్ వెంకట్రాజు, ఎంపీహెచ్‌ఏ జేఎస్ గనిరాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం ఆరోగ్య కేంద్రంలో పరిధిలో అప్పారావుపేట, దండగర్ర, మెదుగుగుంట, అరుగొలను, కొత్తూరు, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, జగన్నాథపురం, మాధవరం గ్రామాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలోని 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సులో ఉన్న వారికి శుక్రవారం నులి పురుగు నివారణ మాత్రలు అందజేశారు. ఎంఈఓ పీఎంకే జ్యోతి, డాక్టర్ ఏవీ వెంకటేష్, టి.శ్రీనాథ్, ఎంపీహెచ్‌ఈఓ జి.వెంకటేశ్వరారావు, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకుందాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): చేతులను పరిశుభ్రంగా ఉంచుకుందామని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధాయులు బాలీశ్వరయ్యలు పేర్కొన్నారు. నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భవిత సెంటర్‌లో ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు పండ్లును, కూరగాయాలను శుభ్రమైన నీటితో కడిగి ఆహారంగా అందించాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోళ్లను కత్తిరించుకోవాలని, ఆరుబయిట మల విసర్జన చేయరాదని, మరుగుదొడ్లను మాత్రమే ఉపయోగించాలని. ఆహారం తినే ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. డి వార్మింగ్ మాత్రలు అందజేసి, నులిపురుగులను నివారించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం డి.సుష్మ, ఎం.చంద్రకుమారి, కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులు నులిమేద్దాం

ఇరగవరం: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులిమేద్దామని పీహెచ్‌సీ వైద్యులు బంగారు రవి,సాయిగిరి రెడ్డి తెలిపారు. మండలంలోని రేలంగి పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జికెఆర్‌సీవీ ప్రసాద్, డి తులసి దేవి, అనంత లక్ష్మీ, ఎం జయరాజ్, ఎంఎల్‌హెచ్‌పీలు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

తణుకు టౌన్: నులిపురుగుల నివారణతోనే పిల్లల్లో శారీరక మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని వేల్పూరు పీహెచ్‌సీవైద్యాధికారి డా.కెఎంఆర్ కిషోర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తణుకు మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.